# 2. సాహిత్యంలో నిరోధ్

ప్రభుత్వం అనేదాన్ని దున్నపోతు తోనూ, పాలకులను కుంభకర్ణులతోనూ పోల్చటమనేది చాలా చాలా పాత బడిపోయిన ఫాషన్. నిజానికి మన ప్రభుత్వంలో పంచకళ్యాణిలా కాకున్నా కనీసం ఆవులా, దాని దూడల్లానయినా పరుగెత్తగల శాఖలు కొన్నయినా ఉన్నాయి.

వెనకటికో తెలుగువాడు నరకానికి వెళ్తే అక్కడ అడుగు పెట్టీ పెట్టగానే ఒ అయ్యరుగారు గ్లాసుడు ఉచిత మంచినీళ్ళతో స్వాగతమిచ్చి—

"ఏమి తినిపెదవు సోదరా! ఇడ్లీ, వడ, దోసై, నెస్‌కాఫీ" అంటూ లిస్టు విప్పాడట. కాని, ఆ అయ్యర్లు కూడా వారి సాంబారు సహితంగా మన "నిరోధ్" శాఖ వారిముందు తల వంచాల్సిందే! అందుగల రిందుండరను సందేహం లేకుండా దొరికిన సమస్త ప్రచార సాధనల్లోనూ వీళ్ళు కుటుంబనియంత్రణా తారక మంత్రాన్ని సదా పఠించకుంటే రాగల క్రూర ఘోర దారుణ పరిణామాల్ని గురించి రాత్రిళ్ళు నిద్రలో కూడా ఉలిక్కిపడి లేచి మరీ ఆలోచింప జేసేటంతగా ప్రజలకు నిస్వార్థ జ్ఞానోపదేశం చేస్తుంటారు.

ఈమధ్య దినపత్రికల్లో గర్వించదగిన నిరోధ్ వార్త ఒకటి వచ్చింది— "గతించిన ఆర్నెల్ల కాలంలోనూ దేశంలో 30 లక్షల నిరోధ్‌లు ఉచితంగా పంచిపెట్టబడ్డాయి. అందులో సగం వేసెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్నవారి కివ్వటం జరిగింది" అని దాని సారాంశము. ఈ వార్తలోని రెండోభాగం నాకు సరిగా బోధపడలేదు. అచ్చుతప్పులు మనకు మామూలే గదాండీ! కనుక, "వాసెక్టమీలు చేయించుకోని వాళ్ళకు పంచిపెట్టబడ్డాయి" అని సవరించుకొన్నాను.

"అయితే, మరి మొదటి సగం ఎవరికి పంచిపెట్టినట్టూ? అన్నాడు మా అప్పారావు. ఈ పలక్షన్లయ్యాక తీరిగ్గా ఆలోచిద్దాం లెమ్మన్నాను.

"మన జనాభా నలభై కోట్లలోనూ ఈ ముప్పై లక్షలు ఏ మూల ? అన్నాడు అప్పారావు మళ్ళీ.

నాకు వళ్ళు మండుకొచ్చింది ఈ మధ్య ప్రతి కుంకా ఓ మహా విమర్శకుడిలా ఫోజులు పెడుతున్నాడు.

ఆధునిక తెలుగు కథా సాహిత్యం నిండా కేవలం ఒక్క జననాన్ని నిరోధించలేక నిండు ప్రాణాల్ని బలిచేసుకున్న అమాయక కన్యకామణుల హృదయ విదారక గాధలు తట్టల కొద్దీ, మ్యునిసిపాల్టీ చెత్తబళ్ళ కొద్దీ ఉన్నాయని వాడికేం తెలుసు.

ఈ నిరోధ్ తారకమంత్రం తెలీకే గంపెడు పిల్లలతో దారుణ జీవితాలు గడిపే గుమస్తాగాళ్ళు అభ్యుదయ కథా సాహిత్యాన్ని నాక్రమించుకుని తాము తనివితీరా ఏడ్చి, మనల్ని కూడా ఏడవమంటున్న బోడినిజాన్ని మాత్రం ఎవరు విస్మరించగలరు.

ఈ నిరోధాల శాఖలో కొందరయినా సాహితీ పిపాసువులూ, మహాకవులూ ఉండిఉండాలి. లేకుంటే గుండెగొంతుకలోన కొట్లాడుతాది ... అన్నట్టుగా సదా మన బుర్రల్లో కొట్లాడే కవితాత్మక స్లోగన్లను సృష్టించటం మామూలు ఆఫీసర్లకు సాధ్యమా !

ప్రచారంలో కూడా బహుళార్థ సాధక ప్రాజెక్టుల్లాంటివి కొన్ని ఉంటాయి. ఆ మధ్య ఓ తాజా, తాజా కవితా సంకలనం వెనుక అట్టమీద ఎర్ర త్రికోణంతోపాటు "నిరోధించండి! నిరోధించే శక్తి మీ చేతుల్లోనే ఉంది" అంటూ స్లోగన్ సహిత అడ్వర్టయిజు మెంటొకటి ప్రత్యక్షమయింది.

ఓపికగా నాలుగు టీలు, నలభై సిగరెట్లూ తగలేసి మరీ ఆ కవిత్వాన్నాస్వాదించాక మన నిరోధీయుల తెలివితేటల్ని, సమయోచిత సందర్భోచిత ప్రకటనా పాటవాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. నిజమే ఆ సంపుటంలోని కవుల ఏడుపూ, వారి కవిత్వమూ పూర్తిగా నిరోధించ దగినదిగానే ఉంది. ఆ పుస్తకంలోని నూటపాతిక పేజీల సారాన్ని

ఒక్క ముక్కలో తేల్చి వెనుక అట్టమీద అచ్చుగుద్ది చెప్పిన మన నిరోధ విమర్శకుడికి ఎన్ని నిరోధ్‌లు బహుకరించినా రుణం తీరదు.

చదవక్కర్లేని, కనీసం ముక్కు మూసుకునయినా చూడనక్కర్లేని సాహిత్యం మనకీనాడు శివకాశీ ఆఫ్ సెట్ ప్రెస్సులకొద్దీ వస్తూంది. దీన్ని విమర్శిస్తూ అంతకన్నా మరో డిగ్రీ ఎక్కువ సువాసన వేసే సాహిత్యం కూడా అక్కర్లేనంత వస్తూనే ఉంది. అవీ ఇవీ అచ్చేసి ప్రెస్ ఓనర్లు మేడలు కడుతూంటే, వాటిని కంపోజు చేసిన పాపానికి వర్కర్లలో కొందరికి పిచ్చెక్కుతోందట.

వీటన్నిటిని నిస్సందియంగా నిరోధించాల్సిందేనని అందరూ ఉద్ఘాటిస్తూనే ఉన్నారు. కాని, ఆ ఉద్ఘాటించే వారి సాహిత్య సృష్టికూడా నిరోధించవలసిన స్థాయిలోనే ఉండటం ఓ పెద్ద విశేషం.

కనుక "సాహిత్య నిరోధ్" నొకదానిని కనిపెట్టాల్సి ఉంది. ఘనమైన ఏలినవారికి వారి నిరోధ్ వారికి ఉండనే ఉన్నది. దానిని వారు తెలివిగా వాడి చాలా సాహిత్యాన్ని నిరోధిస్తూ వుంటారు. ఈ నిరోధ్ పాలబడిన పదవీ పిపాసులు చలువబట్ట లేసుకొని, చలువ కళ్ళజోళ్ళు తగిలించి చలువ పందిళ్ళ క్రింద జరిగే వార్షిక సాహిత్య పెళ్ళిళ్ళకూ, విందు భోజనాలకూ ఖాళీ బుర్రల్తో వెళ్లి, ఖాళీ బుర్రల్తో వచ్చి, ఖాళీ

బుర్రలుగల పాఠక మహాశయులచేత "పెబాస్" అనిపించుకో గల ఉత్తమ సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉంటారు. అది చదివే వాళ్ళు అదృష్టం పుచ్చిన వాళ్ళే. వాళ్ళకి సమస్యా లుండవు, ఆలోచనలుండవు. హాయిగా తిని పడక వేసి పుస్తకం హస్త భూషణంగానే కునికిపాట్లు పడగలరు.

ఈ సాహితి పరుల్లో ఇంకాస్త తెలివిగల మనుష్యులు న్నారు. వాళ్ళు ఈ నిద్రబోతు సాహిత్యంలోనే కాస్త అభ్యుదయాన్నో, పిసరంత విప్లవాన్నో మసాలాగా వేసి మరీ వండుతారు తమ కవిత్వాన్ని. ఆ నిద్రబోతు కవితకన్నా ఈ సెమీ నిద్రబోతు కవిత ఎక్కువ ప్రమాదకరం—

...అని చాలామంది గుర్తించటం లేదు. కనుక ఈ నగటు రచయితల, లేదా పెద్ద మనిషి పైపు రచయితల, లేదా గోడమీది పిల్లి రచయితల కోసం తక్షణం ఓ నిరోధ్‌ను కనిపెట్టటం చాలా చాలా అర్జంటు అవసరం.

(మార్చి 1971)